సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



ఇళ్ల నిర్మాణాలను..
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు.
- IIలో ▸



బీసీ బంద్‌కు అఖిలపక్షం..
రాష్ట్రవ్యాప్త బీసీ బంద్‌కు అఖిలపక్ష పార్టీల మద్దతు ఉందని బీసీ జేఏసీ ప్రతినిధులు వెల్లడించారు.
- IIలో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 34.2 /19.8
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. మబ్బులతో కూడిన ఎండ ఉంటుంది.

న్యూస్‌రీల్

డిప్యుటేషన్లు, బదిలీలకు దరఖాస్తులు

ఖలీల్‌వాడి : జిల్లాలోని లోకల్ కేడర్ తాత్కాలిక డిప్యుటేషన్లు, బదిలీల కోసం అర్హత కలిగిన ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవో నెంబర్ 190, జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ జీవో నెంబర్ 190 ప్రకారం సబ్‌-కమిటీ సిఫార్సులలో ఉన్న సబ్జెక్టు ఖాళీలకు లోబడి దరఖాస్తులకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. పాఠశాల విద్య (ఎస్‌పీఎఫ్‌ఐఐ) జీవో నెంబర్ 25ను ఈనెల 12న ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. నిబంధనల ప్రకారం జిల్లాలోని బోధన, బోధనేతర ఉద్యోగులు అక్టోబర్ 17 నుంచి 24 వరకు ఇంటర్ లోకల్ కేడర్ తాత్కాలిక డిప్యుటేషన్ల కోసం schooledu.telangana.go.in పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



నిజామాబాద్‌అర్బన్ : నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను తపాలా శాఖ ద్వారా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఇతర అధికారులతో కలిసి సీఈవో సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో 100 సంవత్సరాల వయసు కలిగిన ఓటర్లను గుర్తించి వారి వయసును తగిన ఆధారాలతో సమర్పించాలన్నారు. బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, ఫారం 6, 7, 8 దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.కోటి విరాళం



నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా మాక్లూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.కోటి విరాళం ఇచ్చారు. గురువారం ఆయన తన సోదరుడు బిగాల మహేశ్‌తో కలిసి కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో అశోక్ పాల్గొన్నారు.



సాక్షి గొంతునొక్కే కుట్రలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ నిరంతరం అక్షరయజ్ఞం చేస్తున్న 'సాక్షి' దినపత్రికపై అక్రమ కేసులు బనాయించి గొంతు నొక్కేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. ఈ అన్యాయాలను, కుట్రలను అన్ని వర్గాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. సామాజిక రుగ్మతలపై, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పాటుపడుతున్న 'సాక్షి' పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి మీద వరుసగా కేసులు పెడుతుండడంతోపాటు విచారణల పేరిట వేధింపులకు గురిచేయడం పట్ల చంద్రబాబు ప్రభుత్వంపై సర్వత్రా వ్యతిరేకత వస్తోంది. ఈ నేపథ్యంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు 'సాక్షి'పై చేస్తున్న కక్షసాధింపు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఏపీ ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను ఎండగట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిజామాబాద్ నగరపాలక సంస్థ కూడలిలో నిరసన కార్యక్రమం జరుగనుంది. జర్నలిస్టు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక, విద్యార్థి, యువజన సంఘాలు పాల్గొననున్నాయి.

పత్రికలను వేధించడం అప్రజాస్వామికం



ప్రజా సమస్యలపై ప్రజలను చైతన్య పరుస్తున్న పత్రికలపై ప్రభుత్వాలు కక్ష కట్టడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు. పత్రికా స్వేచ్ఛను హరించడం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొత్తకాదు. సాక్షి పత్రికపై, ఎడిటర్, రిపోర్టర్లపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి. కేసులు ఉపసంహరించునేవరకు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటారు.

– వి.ప్రభాకర్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథ రాష్ట్ర నాయకుడు

మీడియాపై ఆంక్షలు సరికాదు



పత్రికలపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదు. సాక్షి పత్రికపై పదే పదే నకిలీ కేసులు పెట్టి వేధించడాన్ని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు తీవ్రంగా ఖండిస్తున్నారు. పత్రికల్లో తప్పుడు కథనాలు వస్తే సంజాయిషీ అడగవచ్చు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు తప్ప తప్పుడు కేసులు పెట్టి వేధించడం సరికాదు. నిరంకుశత్వంతో అణగదొక్కుతామంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. ప్రజల నుంచి తీవ్ర నిరసనను పాలకులు ఎదుర్కోక తప్పదు.

– రమేశ్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే..



సాక్షి పత్రికపై ఏపీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం సరికాదు. వాస్తవాలు ప్రజలకు చేరవేసే సాక్షి వంటి ప్రజా పత్రికా విలేఖరులపై అక్రమ కేసులు బనాయించడమంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అవుతోంది. ఏపీ ప్రభుత్వ చర్యలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తోంది. ప్రజాస్వామ్యంలో దాడులు, భయభ్రాంతులకు గురిచేయడం హేయమైన చర్యలు.

– ఓమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

నియంతలా కూటమి ప్రభుత్వం



పత్రికలు ప్రజాసమస్యలు వెలికితీసి పరిష్కారానికి కృషి చేస్తాయి. ప్రజా సమస్యలను సాక్షి పత్రిక బయటపెడుతుంటే ఏపీలోని కూటమి ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోంది. ఏపీ ప్రభుత్వం విద్య, వైద్యాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించకుండా పత్రికలు ప్రజాపక్షం వహిస్తే అక్రమ కేసులు బనాయించి భయపెట్టే ప్రయత్నం చేస్తోంది. ఈ కుట్రలను ప్రజాస్వామికవాదులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. సాక్షిపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలి.

– ముస్కె సుధాకర్, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

జిల్లాకు వ్యవసాయ కళాశాల

- ఆమోదం తెలిపిన రాష్ట్ర కేబినెట్
- ఏర్పాటైతే వ్యవసాయ రంగానికి మరింత ఊతం
- విద్య, పరిశోధనలతోపాటు కొత్త వంగడాల సృష్టికి అవకాశం



డొంకేశ్వర్(ఆర్మూర్) : వ్యవసాయాధారిత జిల్లాగా పిలువబడే నిజామాబాద్‌లో వ్యవసాయ కళాశాల ఏర్పాటు కానుంది. ఈ మేరకు గురువారం జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది ఏర్పాటైతే విద్యార్థులకు, రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగనున్నాయి. వ్యవసాయ రంగానికి మరింత ఊతం ఇచ్చినట్లు అవుతుంది. ఐతే, అగ్రి కోర్సులు చేసే నిజామాబాద్ జిల్లాతో పాటు కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల్ విద్యార్థులకు వ్యవసాయ కళాశాల వరమనే చెప్పవచ్చు. తెలంగాణ యూనివర్సిటీలో ఇటీవల ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఇప్పుడు వ్యవసాయ కళాశాలను తేవడం నిజామాబాద్‌కు మరింత వన్నె తెస్తుంది. వ్యవసాయ కళాశాలను కూడా యూనివర్సిటీ పక్కనే ఏర్పాటు చేయనున్నారు.

జిల్లాలో ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టులు పంటలకు పుష్కలంగా సాగునీటిని అందిస్తున్నాయి. దీంతో జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగవుతున్నాయి. వరి అత్యధికంగా 4.5 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. పసుపు, మొక్కజొన్న, సోయా, జొన్నలు, సజ్జలు కూడా ఎక్కువగా సాగవుతున్నాయి. జిల్లాలో పండించిన పంటలు ఇతర ప్రాంతాలు, దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. రాష్ట్రంలో అత్యధిక పంటలు, రైతులు ఉన్న జిల్లాల్లో ఒకటిగా నిజామాబాద్ ఉంది. అందుకే ఇక్కడ వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు డిమాండ్ ఏర్పడింది. ప్రజాప్రతినిధుల చొరవతో కేబినెట్ ద్వారా ఇప్పుడు ఆమోద ముద్ర పడింది. చెరుకు పరిశ్రమలు అలాగే రుద్రూర్ కృషి విజ్ఞా కేంద్రం, కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రాలకు తోడుగా వ్యవసాయ కళాశాల రావడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

ఎంచక్కా విద్య... స్థానికంగా పరిశోధన...

ఇందూరు కేంద్రంగా వ్యవసాయ కళాశాల ఏర్పాటైతే చుట్టు పక్కనున్న జిల్లాల విద్యార్థులు నిజామాబాద్‌లోనే వ్యవసాయ కోర్సులు పూర్తి చేయడానికి అవకాశం ఉంది. వ్యవసాయ కోర్సులు చేయాలంటే హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, జగిత్యాల ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అంత దూరం వెళ్లి చదువు, పరిశోధనలు చేయాలంటే విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ఇప్పుడు నిజామాబాద్ వ్యవసాయ కళాశాలలోనే పట్టభద్రులుగా, పరిశోధకులుగా, ప్రొఫెసర్లుగా తయారు కావొచ్చు. వ్యవసాయానికి అనువుగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో పంటలపై ప్రయోగాలు సులువుగా చేయడానికి వీలుంటుంది. కొత్త వంగడాలు ఇక్కడి వాతావరణానికి అనుకూలంగా తయారు చేయవచ్చు. రైతులు, ఆదర్శ రైతులు కూడా కళాశాలను సందర్శించి శాస్త్రవేత్తలను కలిసి వ్యవసాయంలో కొత్త పద్ధతులను తెలుసుకోవచ్చు. వ్యవసాయ, ఇతర అనుబంధ శాఖలకు కూడా అగ్రి కాలేజీ బలాన్ని చేకూరుస్తుందని చెప్పవచ్చు. భవిష్యత్తులో రాష్ట్రానికి, దేశానికి ఇక్కడి నుంచే వ్యవసాయానికి ఊపిరిలూదే అవకాశం లేకపోలేదు.

సొంత జిల్లాపై మహేశ్ గౌడ్ ముద్ర

- ఇప్పటికే తెయూలో ఇంజినీరింగ్ కళాశాల
- తాజాగా వ్యవసాయ కళాశాల
- టెంపుల్ రోడ్డు కోసం రూ.450 కోట్లతో ప్రతిపాదనలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ సొంత జిల్లాపై తనదైన ముద్ర వేస్తున్నారు. గతేడాది పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకున్న సమయంలో ఇచ్చిన హామీలను వరుసగా నెరవేరుస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయించారు. తాజాగా ఇప్పుడు వ్యవసాయ కళాశాల మంజూరు చేయించారు. గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో రాష్ట్రంలో మూడు చోట్ల వ్యవసాయ కళాశాలలు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్, ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గం హుజూర్‌నగర్లో, మహేశ్ గౌడ్ కృషితో నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటుకు నిర్ణయించారు. డిచ్‌పల్లి మండలంలోని తెలంగాణ యూనివర్సిటీ పక్కన రూ.124 కోట్ల నిధులతో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇక మిగిలిన మరో హామీ త్వరలో నెరవేరుస్తానని మహేశ్ గౌడ్ 'సాక్షి'కి తెలిపారు.

ధర్మపురి–కొండగట్టు–వేములవాడ–లింబాద్రి గుట్ట–బాసర టెంపుల్ రోడ్డు రహదారి నిర్మాణం కోసం రూ.450 కోట్లు మంజూరు చేయించేందుకు ఇప్పటికే ప్రత్యేకంగా ప్రతిపాదనలు చేసినట్లు పేర్కొన్నారు.

లిక్కర్‌కు మహా కిక్కు

- బోధన్, జుక్కల్ నియోజకవర్గాల్లోని వైన్స్‌లపై మహారాష్ట్ర వ్యాపారుల ఆసక్తి
- తెలంగాణతో పోలిస్తే పొరుగు రాష్ట్రంలో మద్యం ధర ఎక్కువ ఉండటమే కారణం
- నేడు, రేపు మద్యం దుకాణాల కోసం టెండర్ల జాతర !



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఈసారి ఉమ్మడి జిల్లాలో మద్యం టెండర్లపై మహారాష్ట్ర వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. కాగా 2025–27 సంవత్సరాలకు గాను మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తులకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన గడువు శనివారంతో ముగియనుంది. లాటరీ పద్ధతిలో కేటాయించే దుకాణాల టెండర్లకు ఎక్సైజ్ శాఖ గత నెల 26 నుంచి ఈ నెల 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 102 మద్యం దుకాణాలు ఉండగా, కామారెడ్డి జిల్లాలో మొత్తం 49 దుకాణాలు ఉన్నాయి. వీటికి 2023–25 సంవత్సరాలకు సంబంధించి 5,963 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నిజామాబాద్ జిల్లాలోని దుకాణాల కోసం 3,759 దరఖాస్తులు, కామారెడ్డి దుకాణాలకు సంబంధించి 2,204 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ దరఖాస్తుల్లో 95 శాతం చివరి రెండు రోజుల్లోనే వచ్చాయి. అందువల్ల గతంలో మాదిరిగానే ఈసారి కూడా చివరి రెండు రోజుల్లో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 1,106 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నిజామాబాద్ జిల్లా దుకాణాల కోసం 687, కామారెడ్డి దుకాణాల కోసం 419 దరఖాస్తులు వచ్చాయి. అయితే 1,106 దరఖాస్తుల్లో 422 దరఖాస్తులు గురువారం ఒక్కరోజు వచ్చినవే కావడం గమనార్హం. చివరి రెండు రోజుల్లో భారీగా దరఖాస్తులు రానున్నట్లు అంచనా.

గడువు ముగిసేలోగా భారీగా..



గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా చివరి రెండు రోజుల్లో దరఖాస్తులు వెల్లువెత్తనున్నాయి. ఇందుకు తగినట్లుగా అన్ని ఏర్పాట్లు చేశాం. ఈనెల 18న అర్ధరాత్రి వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం. సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి సైతం టెండర్లు వేసేందుకు ఆసక్తి చూపుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. బోధన్, బిచ్కుంద దుకాణాలకు సంబంధించి మహారాష్ట్ర వారి నుంచి దరఖాస్తులు మరింతగా వస్తాయని భావిస్తున్నాం.

– సోమిరెడ్డి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

మహారాష్ట్ర నుంచి..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సరిహద్దులో ఉన్న మహారాష్ట్రలో తెలంగాణతో పోలిస్తే మద్యం ధరలు 20 శాతం ఎక్కువ. దీంతో సరిహద్దుల్లోని నాందేడ్ జిల్లాకు చెందిన పలువురు ఆసక్తి కలిగిన వారు బోధన్, జుక్కల్ నియోజకవర్గాల్లోని మద్యం దుకాణాలకు టెండర్లు వేస్తున్నారు. నిన్నటి రోజు వచ్చిన 422 దరఖాస్తుల్లో సుమారు 100 వరకు జిల్లాయేతరులు వేసినవే కావడం గమనార్హం. ఇందులో కరీంగనర్ జిల్లాకు చెందిన వారు వేసిన దరఖాస్తులు 60 ఉండగా, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన వారువేసినవి 40దరఖాస్తులు ఉండడం విశేషం. మహారాష్ట్రకు చెందిన వారు సుమారు 1000 వరకు దరఖాస్తులు వేయనున్నట్లు ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. లిక్కర్ దుకాణాల టెండర్లకు మహా కిక్కు వస్తోందని ఎక్సైజ్ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి



మాట్లాడుతున్న బస్వా లక్ష్మీనర్సయ్య

సుభాష్‌నగర్ : రాష్ట్రంలో వరి కోతలు మొదలు పెట్టి 15 రోజులు కావస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించలేదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య అన్నారు. యుద్ధప్రాతిపదికన కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వర్షానికి ధాన్యం తడిసిపోతోందన్నారు. రైతులు గత్యంతరం లేక క్వింటాలుకు రూ.1600 నుంచి రూ.1700 వరకు దళారులకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తరుగు పేరుతో అధికారులు, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నా రని, సీఎంఆర్ ఇవ్వని రైస్‌మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టాల్సి ఉన్నా అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. యాసంగి పంటకు బోనస్ డబ్బులు చెల్లించాలన్నారు. సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, హరీశ్ రెడ్డి, పంచరెడ్డి శ్రీధర్, శ్రీనివాస్, ఇప్పకాయల కిషోర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

అభిప్రాయ సేకరణ.. ఆసక్తికరం

- డీసీసీ ఎన్నికపై నియోజకవర్గాలవారీగా సమావేశాలు
- ఇప్పటికే బోధన్, ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ అర్బన్‌లలో పూర్తి
- నేడు నిజామాబాద్ రూరల్‌లో, రేపు బాన్సువాడలో..
- నియోజకవర్గాల్లో మారుతున్న సీనియర్ల ప్రాధాన్యతలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి పార్టీ నాయకత్వం చేపట్టిన వడపోత కార్యక్రమం జిల్లాలో రోజురోజుకూ ఆసక్తిని మరింతగా పెంచుతోంది. పైగా పీసీసీ అధ్యక్షుడి సొంత జిల్లా కావడంతో ఉత్కంఠ కలిగిస్తోంది. ఈ సీటును బీసీకి అప్పగిస్తారా.. ఓసీకి కేటాయిస్తారా అనే విషయంలో కచ్చితమైన నిర్ణయానికి రాకపోయినప్పటికీ ఏఐసీసీ పరిశీలకుడు, కర్ణాటక ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ ప్రతి అంశాన్ని కూలంకశంగా పరిశీలిస్తున్నారు. ఈ పీఠం కోసం పోటీలో ఉన్నవారితో ఇప్పటికే ఈ నెల 14న ఒకసారి ముఖాముఖి నిర్వహించారు. తాజాగా గురువారం మరోసారి ముగ్గురితో ముఖాముఖి నిర్వహించారు. బాడ్సి శేఖర్‌గౌడ్, మార చంద్రమోహన్‌రెడ్డి, బాస వేణుగోపాల్‌యాదవ్‌లతో పరిశీలకుడు రిజ్వాన్ అర్షద్ ముఖాముఖి మాట్లాడారు. శుక్రవారం కాటిపల్లి నగేశ్‌రెడ్డితో ముఖాముఖి నిర్వహించనున్నారు. పరిశీలకుడు ఆయా నియోజకవర్గాల వారీగా అందులో బ్లాకుల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. సీనియర్ నాయకులతో మాట్లాడి మొదటి, రెండో ప్రాధాన్యత అభిప్రాయ సేకరణ చేస్తున్నారు.

ప్రాధాన్యాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణలో భాగంగా ఏఐసీసీ పరిశీలకుడు ఈ నెల 14న బోధన్ నియోజకవర్గంలో సమీక్ష నిర్వహించారు. అక్కడ బీసీ కోటాలో గంగాశంకర్ పేరు, ఓసీ కోటాలో నగేశ్‌రెడ్డి పేర్లు చెప్పినట్లు సమాచారం. ఆర్మూర్ నియోజకవర్గంలో ఓసీ కోటాలో మార చంద్రమోహన్‌రెడ్డి, బీసీ కోటాలో శేఖర్‌గౌడ్ పేర్లు, బాల్కొండ నియోజకవర్గంలో బీసీ కోటాలో బాస వేణుగోపాల్‌యాదవ్, శేఖర్‌గౌడ్, ఓసీ కోటాలో మార చంద్రమోహన్‌రెడ్డి పేర్లు చెప్పినట్లు తెలిసింది. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో మార చంద్రమోహన్‌రెడ్డి,

ఆశావహుల మధ్య పోటాపోటీ..

శేఖర్‌గౌడ్, వేణుగోపాల్ యాదవ్ పేర్లు ఎక్కువ మంది చెప్పినట్లు సమాచారం. ఇక శుక్రవారం కీలకమైన, రాజకీయంగా వేడి పుట్టించే నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో అభిప్రాయ సేకరణ, సమావేశాలు నిర్వహించనున్నారు. ఇక్కడ బాడ్సి శేఖర్‌గౌడ్, నగేశ్‌రెడ్డి పేర్లు ఎక్కువ మంది చెబుతారని అంచనా.

ఇక రెండు జిల్లాల్లో విస్తరించి ఉన్న బాన్సువాడ నియోజకవర్గంలో శనివారం సమావేశం, అభిప్రాయ సేకరణ చేయనున్నారు. ఎవరి పేర్లు ఎక్కువగా చెబుతారనే విషయమై ఉత్కంఠ, ఆసక్తి నెలకొన్నాయి. దీంతో పరిస్థితి రసవత్తరంగా మారింది. మొత్తంమీద ఓసీ, బీసీ కోటా మేరకు చూసుకుంటే బాడ్సి శేఖర్‌గౌడ్, బాస వేణుగోపాల్‌యాదవ్, మార చంద్రమోహన్‌రెడ్డి, కాటిపల్లి నగేశ్‌రెడ్డి మధ్య నువ్వా, నేనా అనేవిధంగా పోటాపోటీ నడుస్తోంది. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీల ఆలోచన ఏవిధంగా ఉందోననే అంశంపై పార్టీ శ్రేణుల్లో తీవ్రమైన చర్చ నడుస్తోంది.

డీలర్ల పరేషన్

- కమీషన్ కోసం ఎదురుచూపులు
- ఐదు నెలలుగా పెండింగ్
- జిల్లాలో రూ.3 కోట్లకుపైనే బకాయిలు



రేషన్‌దుకాణంలో బియ్యం పోస్తున్న డీలర్ (ఫైల్)

సుభాష్‌నగర్ : ప్రజాపంపిణీ పథకం కింద పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్లు కమీషన్ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. ఐదు నెలలుగా కమీషన్ డబ్బులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని డీలర్లకు ఐదు నెలలకు సంబంధించి రూ.3 కోట్లకు పైనే బకాయిలు పేరుకుపోయాయి.

జిల్లాలో 759 రేషన్‌దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా 4,47,788 వరకు కార్డుదారులకు బియ్యం పంపిణీ అవుతోంది. ప్రతినెలా సుమారు 7,650 మెట్రిక్ టన్నుల బియ్యం డీలర్లు పంపిణీ చేస్తున్నారు. ఇందుకు సంబంధించి రేషన్‌షాపుల డీలర్లకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.140 చొప్పున కమీషన్ చెల్లిస్తోంది. ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, సభ్యుల చేరికతో గత మూడు నెలల నుంచి అన్ని దుకాణాల్లో బియ్యం కోటా పెరిగింది. మార్చి వరకు సజావుగా కమీషన్ డబ్బులు జమ చేసిన ప్రభుత్వం.. ఇటీవల ఏప్రిల్ కమీషన్ జమ చేసింది. మే నుంచి సెప్టెంబర్ వరకు బకాయిలు పేరుకుపోయాయి. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త నిబంధనల ప్రకారం వేర్వేరుగా కమీషన్ జమ చేస్తుండటంతో డీలర్లు అయోమయ పరిస్థితిలో ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో డీలర్లు

ఐదు నెలలుగా కమీషన్ డబ్బులు జమ చేయకపోవడంతో డీలర్లు ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణాల అద్దె, బియ్యం సరఫరా కు అవసరమైన సిబ్బంది జీతం, ఎంఎల్‌ఎస్ పా యింట్ నుంచి లారీల్లో వచ్చిన బియ్యాన్ని దుకా ణాల్లో దిగుమతి చేసిన హమాలీల చార్జీల చెల్లింపు, తదితర ఆర్థికపరమైన అంశాల్లో డీలర్లు సతమతమవుతున్నారు.

మరోవైపు ప్రభుత్వం మే నెల కమీషన్ పెండింగ్‌లో ఉంచడంతోపాటు, జూన్, జూలై, ఆగస్ట్ నెలల బియ్యం వర్షాల నేపథ్యంలో ఒకేసారి జూన్ నెలలోనే సరఫరా చేసేసింది. ఆ మూడు నెలలతోపాటు సెప్టెంబర్ కమీషన్ కూడా బకాయి ఉంది. ఐదు నెలల కమీషన్ డబ్బులు జమ కాకపోవడంతో అప్పుల పాలు కావాల్సి వస్తోందని రేషన్‌డీలర్లు వాపోతున్నారు.

అక్టోబర్ 1లోపు జమ చేయాలి..

రేషన్‌డీలర్లకు అక్టోబర్ 1లోపు పెండింగ్‌లో ఉన్న కమీషన్ డబ్బులు జమ చేయాలి. కమీషన్ కోసం ఇప్పటికే సంబంధిత మంత్రితో పాటు కమిషనర్‌ను కలిసి విన్నవించాం. అయినా స్పందించడంలేదు. దీపావళి తర్వాత రాష్ట్ర కమిటీతో చర్చించి బియ్యం పంపిణీని నిలిపివేసే ఆలోచనలో ఉన్నాం. అదేవిధంగా ప్రతినెలా ఒకటో తేదీనే కమీషన్ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి. కమీషన్‌ను పెంచే విధంగా చర్యలు చేపట్టాలి.

– అతిమల నగేష్, జిల్లా అధ్యక్షుడు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం

క్లుప్తంగా

గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి 5 నుంచి 9వ తరగతులలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయ అధికారి మాధవీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 23 ఫిబ్రవరి 2025న నిర్వహించిన ప్రవేశపరీక్షకు విద్యార్థులు హాజరై ఉండాలని పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4, 5, 6, 7, 8వ తరగతులు పూర్తిచేసి ఉండాలన్నారు. లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తారన్నారు. ఈ నెల 17, 18వ తేదీల్లో హాల్‌టికెట్‌, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల ఒరిజనల్‌, జిరాక్స్‌ ప్రతులతో డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

షార్ట్‌ ఫిల్మ్‌ తీసేందుకు దరఖాస్తులు..

నిజామాబాద్‌ అర్బన్‌: ఈ నెల 21న నిర్వహించే పోలీస్‌ ఫ్లాగ్‌ డే సందర్భంగా పోలీసులకు సంబంధించిన అంశాలపై షార్ట్‌ ఫిల్మ్‌ తీసేందుకు ఆసక్తి ఉన్న ఫొటో, వీడియోగ్రాఫర్లు దరఖాస్తు చేసుకోవాలని సీపీ సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. 2024 అక్టోబర్‌ నుంచి 2025 అక్టోబర్‌ వరకు అత్యవసర సమయాల్లో పోలీసుల సేవలు, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల విధులు, సైబర్‌ నేరాలు, ర్యాగింగ్‌ మత్తు పదార్థాల నిషేధంలో పోలీసుల కృషి తదితర అంశాలపై ఫోటోలు, వీడియోలు ఉండాలన్నారు. వివరాలకు 94400 1827 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేపాల్‌ అమ్మాయి.. తెల్గాపూర్‌ అబ్బాయి

● ఒక్కటైన ప్రేమజంట



నిజాంసాగర్‌(జుక్కల్‌): మహ్మద్‌నగర్‌ మండలం తెల్గాపూర్‌ గ్రామానికి చెందిన దనుల రవీందర్‌, నేపాల్‌కు చెందిన మాయ ఒక్కటయ్యారు. గురువారం తెల్గాపూర్‌ గ్రామంలో వేద పండితుడు, గ్రామస్తుల సమక్షంలో ఇద్దరి పెళ్లి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. తెల్గాపూర్‌ గ్రామానికి చెందిన దనుల వెంకవ్వ, ఎల్లయ్య దంపతులు రెండో కుమారుడు రవీందర్‌ ఏడు సంవత్సరాల నుంచి దుబాయ్‌లో ఉంటూ ఉపాధి పొందుతున్నాడు. రవీందర్‌ పని చేస్తున్న కంపెనీలోనే నేపాల్‌కు చెందిన మాయ పనిచేస్తోంది. మూడు సంవత్సరాల నుంచి ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. పది రోజుల కిందట రవీందర్‌తోపాటు మాయ దుబాయ్‌ నుంచి తెల్గాపూర్‌ గ్రామానికి వచ్చారు. రవీందర్‌ తన తల్లిదండ్రులను ఒప్పించి మాయను వివాహం చేసుకున్నారు.

సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి



సీపీఆర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్‌, ఇతర అధికారులు

నిజామాబాద్‌అర్బన్‌: ఆకస్మిక గుండెపోటుకు గురైన వ్యక్తులకు సకాలంలో సీపీఆర్‌ చేసి ప్రాణాలను రక్షించవచ్చని, దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కలెక్టర్‌ టి.వినయ్‌ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఐడీవోసీ సమావేశ మందిరంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో కలెక్టర్‌ పాల్గొని మాట్లాడారు. ఆకస్మికంగా కొందరికి గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అలాంటి వారికి సీపీఆర్‌తో ప్రథమ చికిత్స చేస్తే ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడతారన్నారు. జిల్లాలో సీపీఆర్‌పై ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం సీపీఆర్‌ ఎలా చేయాలన్న దానిపై మాస్టర్‌ ట్రైనర్స్‌ డాక్టర్‌ వెంకటేశ్‌, వేణుగోపాల్‌ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్‌ కరోలిన్‌ చింగ్తియాన్‌ మావీ, డీఎంహెచ్‌వో రాజశ్రీ, హౌసింగ్‌ పీడీ పవన్‌ కుమార్‌, డిప్యూటీ సీఈవో సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి
- అధికారుల అలసత్వంపై ఆగ్రహం



మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్‌: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. లక్ష్య సాధనకు కృషి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, డబుల్‌ బెడ్రూం ల పంపిణీ ప్రక్రియపై కలెక్టర్‌ గురువారం ఎంపీడీవోలు, ఎంపీవోలు, హౌసింగ్‌ ఏఈలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సుదీర్ఘ సమీక్ష జరిపారు. మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలలో వెనుకంజలో అధికారులపై కలెక్టర్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తూ, నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ, ఎందుకు పురోగతి సాధించడం లేదని మండిపడ్డారు. మంజూరీలు పొందిన వారందరూ తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఉచిత ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డబుల్‌ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. సమీక్షలో ట్రెయినీ కలెక్టర్‌ కరోలిన్‌ చింగ్తియాన్‌ మావీ, హౌసింగ్‌ పీడీ పవన్‌ కుమార్‌, జెడ్పీ డిప్యూటీ సీఈవో సాయన్న తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో భాగస్వాములు కావాలి

రానున్న రోజులలో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్‌ విజన్‌–2047 అంశాలతో డాక్యుమెంటును రూపొందిస్తోందని, ఈ సర్వేలో ఉద్యోగులు, అన్నివర్గాల వారు భాగస్వాములు కావాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి కోరారు. సీఎం రేవంత్‌ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ విజన్‌ 2047 డాక్యుమెంట్‌ తయారీలో ప్రతి ఒక్క పౌరుడు పాల్గొనేలా సిటిజన్‌ సర్వే చేపట్టారన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగే సర్వేలో ఉద్యోగులు పాల్గొనడంతోపాటు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. జిల్లా పౌరులు http//www.telangana.gov.in/telanganarising/ అనే లింక్‌ ద్వారా సర్వేలో పాల్గొనాలని కలెక్టర్‌ కోరారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్‌ జిల్లా కార్యదర్శి నాగమణి



ఎంపికైన జిల్లాస్థాయి క్రీడాకారులు

- ఎస్‌జీఎఫ్‌ జిల్లా కార్యదర్శి నాగమణి
- అండర్‌–17 జిల్లా స్థాయి తైక్వాండో క్రీడాకారుల ఎంపిక

నిజామాబాద్‌నాగారం: క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు బంగారు పతకాలు తేవాలని ఎస్‌జీఎఫ్‌ జిల్లా కార్యదర్శి నాగమణి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్నార్జై కాలనీలో తైక్వాండో మార్షల్‌ ఆర్ట్స్‌ అకాడమీ క్రీడా ప్రాంగణంలో గురువారం అండర్‌–17 బాలబాలికల విభాగంలో ఎంపికల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వచ్చే నెలలో నల్గొండ జిల్లాలో అండర్‌–17 తైక్వాండో పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పీడీ ఈశ్వర్‌, కోచ్‌ ఫారుకి అబ్దుల్లా, కోచ్‌లు వినోద్‌ నాయక్‌, గయాస్‌, మనోజ్‌, వినోద్‌, సీనియర్‌ క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం తైక్వాండో అండర్‌–17 క్రీడాకారులు నియామక అబ్జర్వర్‌లను ఘనంగా సన్మానించారు.

ఎంపికైన బాలికలు :

సారా ఫాతీమా, ఇన్సర్‌ నూరేస్‌, జైనాబ్‌, సాన్వి, సయ్యద్‌ సిద్రామా ఫాతిమా, అన్సరా మిదాత్‌, జామ్లదర్శిని, నివేదిత, వర్షిణి, ఊర్మిళ, నేహ వాసవి, నూరేన్‌

బాలుర విభాగంలో..

అబ్దుల్‌ అజాన్‌షేక్‌, షేక్‌ అబ్దుల్లా ఓమర్‌, రయాన్‌ అబ్దుల్లా ఫారూఖ్‌, షేక్‌ ముస్తాపా రజన్‌, హరీశ్‌, ఇబ్రహీం ఎండీ అబ్దుల్‌, అమాన్‌ సింగ్‌, కాంచిపూరం సిద్ధార్థ, షేక్‌ రిజ్వాన్‌, రహీం, వేదాన్స్‌, హుస్సేన్‌, అమాన్‌

పసుపు పరిశోధన కేంద్రం సందర్శన



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పసుపు పరిశోధన కేంద్రాన్ని వరంగల్‌ స్పైస్‌ బోర్డు ఆధ్వర్యంలో నేక్కొండ, కేసముద్రం, చింతపల్లి, ఒడిశా ప్రాంత రైతులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్‌ మహేందర్‌ పసుపు రకాలు, యంత్రాలు, పరిశోధనలపై పవర్‌ పాయింట్‌ ప్రజేంటేషన్‌ ద్వారా వివరించారు.

మనోహరాబాద్‌లో పసుపు పరిశ్రమ..

జక్రాన్‌పల్లి : మండలంలోని మనోహరాబాద్‌లో ఉన్న పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం పరిశ్రమను వరంగల్‌ జిల్లా రైతులు గురువారం సందర్శించారు. జాతీయ పసుపు బోర్డు ,స్పైసెస్‌ బోర్డు వరంగల్‌ సంయుక్తంగా నిర్వహించిన పసుపు రైతుల విజ్ఞానయాత్రలో భాగంగా వరంగల్‌ జిల్లా నేకొండ ఎఫ్‌పీసీఎల్‌, ఆంధ్రప్రదేశ్‌, ఛత్తీస్‌గఢ్‌, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 40 మంది రైతులు జేఏం కేపీఏం ఫార్మర్‌ ప్రొడ్యూసర్‌ కంపెనీ లిమిటెడ్‌ను సందర్శించారు. కార్యక్రమంలో జేఎంకేపీఎం సూపర్‌వైజర్‌ రుత్విక్‌, స్పైసెస్‌ బోర్డు అసిస్టెంట్‌ డైరెక్టర్‌ జ్యోతిష్‌, సిబ్బంది వెంకటేశ్‌, మాధవ్‌, సంస్థ చైర్మన్‌ తిరుపతిరెడ్డి, డైరెక్టర్‌ సంతోష్‌ రెడ్డి పాల్గొన్నారు .

మొక్కజొన్న తూకంలో మోసం

● రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ వ్యాపారులు




వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

భిక్కనూరు: మండలంలోని గుర్జకుంట గ్రామంలో తూకంలో మోసం చేస్తూ వ్యాపారులు పట్టుబడ్డ ఘటన గురువారం చోటుచేసుకుంది. గాంధారి ప్రాంతానికి చెందిన గిరిజన వ్యాపారులు భిక్కనూరు మండలం గుర్జకుంటలో ఒక ఏజెంట్‌ను పెట్టుకొని మొక్కజొన్నలను కొనుగోలు చేస్తున్నారు. మొక్కజొన్న బస్తాను 62 కిలోల చొప్పున తూకం వేస్తున్నట్లు రైతులను నమ్మించి 72 కిలోల మొక్కజొన్నలను బస్తాలో నింపి వాహనాల్లో వేశారు. రైతులకు అనుమానం రావడంతో తూకం వేసే ఎలక్ట్రానిక్‌ కాంటా 10కిలోలు మైనస్‌లో చూపించడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెంట్‌ను, గాంధారి వ్యాపారులను నిలదీశారు. ఒక దశలో తూకంలో మోసానికి పాల్పడిన వారిని చెట్లకు కట్టివేయాలని పలువురు రైతుల యత్నించగా మిగతా రైతులు వారిని సముదాయించారు. చివరికి వ్యాపారులకు జరిమానా విధించి వదిలిపెట్టారు.

వరద గేట్ల మూసివేత

- ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో
- గోదావరిలోకి నిలిచిన నీటి విడుదల

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ వరద గేట్లను అధికారులు మూసివేశారు. రెండ్రోజుల నుంచి ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో తగ్గుతూ, పెరుగుతూ ఉండటంతో గోదావరిలోకి నీటి విడుదలను పెంచుతూ.. తగ్గించారు. గురువారం ఉదయం వరద మరింత తగ్గడంతో గేట్లను మూసివేశారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి 9,654 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5 వేలు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 3 వేలు, సరస్వతి కాలువ ద్వారా 650, లక్ష్మి కాలువ ద్వారా 200, ఆవిరి రూపంలో 573, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి నిండుకుండలా ఉందని అధికారులు తెలిపారు.



మూసి ఉన్న ఎస్సారెస్పీ వరద గేట్లు

రేపు జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్‌ క్రీడాకారుల ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ రాష్ట్ర జిమ్నాస్టిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 18న జాతీయస్థాయి టోర్నీకి రాష్ట్ర బృందం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌రెడ్డి, స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ది గార్డియన్‌ స్కూల్‌లో తెలంగాణ రాష్ట్ర ఆర్టిస్ట్‌ జిమ్నాస్టిక్స్‌ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్‌ 6 నుంచి 9 వరకు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించే జాతీయస్థాయి టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 9849193002 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

బీసీ బంద్‌కు అఖిలపక్షం మద్దతు



అభివాదం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రవ్యాప్త బీసీ బంద్‌కు అఖిలపక్ష పార్టీల మద్దతు ఉందని బీసీ జేఏసీ ప్రతినిధులు తెలిపారు. నగరంలోని గీతాభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్‌ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 18న తలపెట్టిన బీసీ బంద్‌కు కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌, టీడీపీ, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌ ప్రజాపంథా, ఎంఐఎం పార్టీలు, కుల సంఘాలు, ప్రజాసంఘాలు, డాక్టర్లు, లాయర్లు, జర్నలిస్టులు మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. అన్ని సంఘాలు ప్రత్యక్షంగా బంద్‌లో పాల్గొంటామని బీసీ జేఏసీకి హామీ ఇచ్చాయని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు శాంతియుత ఉద్యమం చేస్తామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ చైర్మన్‌ పోతనకర్‌ లక్ష్మీనారాయణ, వైస్‌ చైర్మన్‌ బొబ్బిలి నర్సయ్య, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర అధికార ప్రతినిధి, జెడ్పీ మాజీ చైర్మన్‌ దాదన్న గారి విఠల్‌రావు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్‌, కాంగ్రెస్‌ ఓబీసీ సెల్‌ జిల్లా అధ్యక్షులు రాజ నరేందర్‌ గౌడ్‌, సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్‌, ఆయా పార్టీలు, కుల సంఘాల, డాక్టర్స్‌, పీఎంపీ, స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.

గోడప్రతుల ఆవిష్కరణ

రాష్ట్ర బీసీ జేఏసీ బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు. గురువారం బంద్‌కు సంబంధించిన గోడపత్రులను ఆయన ఆవిష్కరించారు. బీసీలంటే తనకు ఎనలేని గౌరవమని, వారి కోసం తాను ముందు వరుసలో ఉండి న్యాయం చేసేలా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో నరాల సుదాకర్‌తోపాటు బుస్స ఆంజనేయులు, ఆకుల ప్రసాద్‌, దర్శనం దేవేందర్‌, కొయ్యాడ శంకర్‌, బసవ సాయి చంద్రకాంత్‌, చైతన్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

సిర్పూర్‌ కాగజ్‌నగర్‌లో రుద్రూర్‌వాసి మృతి



శ్రీనివాస్‌ (ఫైల్‌)

రుద్రూర్‌: మండల కేంద్రానికి చెందిన కర్రోళ్ల శ్రీనివాస్‌ (53) అనే వ్యక్తి గురువారం కుమురం భీం జిల్లా సిర్పూర్‌ కాగజ్‌నగర్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు కింద పడి దుర్మరణం చెందినట్లు స్థానికులు తెలిపారు. కూలి పని నిమిత్తం పది రోజుల క్రితం వెళ్లిన శ్రీనివాస్‌ మృతి చెందాడన్న సమాచారం తెలుసుకున్న బంధువులు సిర్పూర్‌ కాగజ్‌నగర్‌కు బయల్దేరి వెళ్లారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

గాంధారి శివారులో మృతదేహం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్ర శివారులోని గాంధారి–చద్మల్‌ రహదారి పక్కన గుంతలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. రైతుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు. దుండగులు గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేసి పెట్రోలు పోసి దహనం చేసినట్లు తెలుస్తోంది. మృతదేహం పాక్షికంగా దహనం అయింది. సదాశివనగర్‌ సీఐ సంతోష్‌ కుమార్‌ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి విచారణ చేశారు. మృతదేహాన్ని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30–35 ఏళ్ల మధ్య ఉంటుందని, నీలిరంగు జీన్‌ ప్యాంటు, తెల్లని బనియన్‌, నల్లచారలు కల్గిన తెల్లచొక్కా ధరించి ఉన్నాడు. సంబంధీకులు ఎవరైనా 8712686165, 8712686163 నెంబర్లకు ఫోన్‌ చేసి సంప్రదించాలని తెలిపారు.

తిరుమలయ్య ఆలయంలో చోరీ

ఇందల్వాయి: నల్లవెల్లి గ్రామంలోని తిరుమలయ్య స్వామి ఆలయంలో బుధవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. 6 గ్రాముల బంగారు, 4 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై సందీప్‌ కుమార్‌ తెలిపారు. వీడీసీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో ..

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని గుండారం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన గురువారం వెలుగుచూసింది. రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ ఆరీఫ్‌, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గుండారం గ్రామానికి చెందిన స్వర్గం లక్ష్మి అదే గ్రామంలోని బంధువుల ఇంట్లో బుధవారం రాత్రి నిద్రించింది. ఇదే అదనుగా భావించిన దుండగులు లక్ష్మి ఇంటి తాళం పగులగొట్టి 2 గ్రాముల బంగారం, 10 తులాల వెండి అపహరించారు. అయితే, చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

అనుమతులు లేని టపాకాయలు సీజ్‌

నిజామాబాద్‌ అర్బన్‌: నగరంలోని దుబ్బ ప్రాంతంలో అనుమతి లేకుండా టపాకాయలు విక్రయిస్తున్న దుకాణంపై మూడో టౌన్‌ పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు కలిసి గురువారం దాడులు చేశారు. రూ. మూడు లక్షల విలువచేసే 29 రకాల టపాకాయలను సీజ్‌ చేసినట్లు మూడో టౌన్‌ ఎస్సై హరిబాబు తెలిపారు. నిబంధనలు పాటించకుండా రాఘవ ఉపాధ్యాయ అనే వ్యక్తి టపాకాయలు విక్రయిస్తున్నట్లు వారు తెలిపారు. కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఇంటర్‌ విద్యార్థి ఆత్మహత్య



దీమర వెంకట్‌(ఫైల్‌)

మాక్లూర్‌: చదువులో వెనుకబడి ఉన్నానన్న మనస్తాపంతో మండలంలోని చిక్లీ గ్రామానికి చెందిన దీమర వెంకట్‌(16) గురువారం సాయంత్రం గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మాక్లూర్‌ ఎస్సై రాజశేఖర్‌ కథనం ప్రకారం.. చిక్లీ గ్రామానికి చెందిన దీమర సాయిరెడ్డి, మంజుల కుమారుడు వెంకట్‌ డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)లోని ఓ కళాశాలలో ఇంటర్‌ ఫస్టియర్‌ చదువుతున్నాడు. చదువులో నెలవారీగా నిర్వహించే కామన్‌ పరీక్షలలో తోటి స్నేహితుల కంటే తక్కువ మార్కులు వస్తున్నాయన్న బాధతో ఉండేవాడని తెలిపారు. దీపావళి పండుగ కోసం నాలుగు రోజుల ముందే చిక్లీకి వచ్చాడు. గురువారం వెంకట్‌ గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సాయిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

నిజామాబాద్‌ రూరల్‌: రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని గంగాస్థాన్‌–1 లక్ష్మీనరసింహ అపార్టమెంట్‌లో గురువారం రాత్రి ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో సీసీఎస్‌ సీఐ సురేశ్‌, సాయినాథ్‌, ఎస్సై గోవింద్‌ కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాడుతున్న 9 మందిని పట్టుకొని, 9 సెల్‌ ఫోన్లు, రూ.49,250 స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ ఆరీఫ్‌కు అప్పగించారు.

రుద్రూర్‌లో ముగ్గురు..

రుద్రూర్‌: మండలంలోని అక్బర్‌నగర్‌ శివారులో పేకాట స్థావరంపై బుధవారం రాత్రి ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1100 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై సాయన్న తెలిపారు.

చెక్‌పోస్టు తనిఖీ

రెంజల్‌(బోధన్‌): మండలంలోని కందకుర్తి శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం తహసీల్దార్‌ శ్రావణ్‌కుమార్‌ తనిఖీ చేశారు. మహారాష్ట్ర నుంచి ధాన్యం అక్రమంగా జిల్లాలోకి ప్రవేశించకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు రోజుల కిందట చెక్‌పోస్టును ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్‌, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో 24 గంటల నిఘా ఉంటుందన్నారు. జిల్లాలో కొనుగోళ్లు పూర్తయ్యే వరకు చెక్‌పోస్టు కొనసాగుతుందని తెలిపారు.

వాహనాల చోరీ నిందితుల అరెస్టు

● వివరాలు వెల్లడించిన సీపీ సాయి చైతన్య



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సాయిచైతన్య

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో పలు చోట్ల వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసినట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. సీసీఎస్‌ పోలీస్‌స్టేషన్‌లో సీపీ గురువారం వివరాలు వెల్లడించారు. కొందరు వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి బోధన్‌, నిజామాబాద్‌, ఆర్మూర్‌, ముథోల్‌లో ఆటోలు, బైక్‌లను చోరీ చేసి కోరుట్ల, జగిత్యాల ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆటోనగర్‌కు చెందిన షేక్‌ ఫజల్‌, మహ్మద్‌ నవాజ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా షేక్‌అలీ, వహిద్‌, అలీమ్‌లతో కలిసి 9 ఆటోలు, మూడు బైక్‌లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. అపహరించిన వాహనాలను కోరుట్లలో విక్రయించినట్లు పేర్కొన్నారు. దొంగ వాహనాలను కొనుగోలు చేసిన మహ్మద్‌ ఇమ్రాన్‌, మహ్మద్‌ ఇలియాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో ముగ్గురిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీసీఎస్‌ ఏసీపీ నగేంద్రచారి, సీఐ సాయినాథ్‌, ఇతర పోలీసు సిబ్బందిని సీపీ అభినందించారు.

తమ్ముడి ఇంట్లో అన్న చోరీ

- వ్యాపారంలో నష్టాలొచ్చాయని..
- కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్‌రాజ్‌

నిజామాబాద్‌ అర్బన్‌: వ్యాపారంలో నష్టాలు, అప్పులు పెరగడంతో తమ్ముడి ఇంట్లో అన్న చోరీకి పాల్పడ్డాడు. నగరంలోని రెండో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో పది రోజుల క్రితం జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. నగర సీఐ శ్రీనివాస్‌రాజ్‌ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 6న మహ్మదీయకాలనీకి చెందిన మహ్మద్‌ సాబీక్‌ పాషా ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు తిరిగిరాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. నగదుతోపాటు బంగారం చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన రెండో టౌన్‌ పోలీసులు విచారణ చేపట్టారు. స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఇంటి పక్కనే ఉన్న అతని అన్న మహ్మద్‌ షఫీ పాషాను అనుమానించి విచారించగా తానే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడం, అప్పులు పెరగడంతో తమ్ముడి ఇంట్లోకి చొరబడి రెండు తులాల బంగారం, రూ.7 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. షఫీ పాషాను అరెస్టు చేసి బంగారం, డబ్బులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. కేసు విచారణలో టౌన్‌ ఎస్సై సయ్యద్‌ ముజాయిద్‌తోపాటు సిబ్బందిని అభినందించారు.



రోజుకు 5 నుండి 7 గంటలు తలను ఫోన్ ముందు వంచి గడపడాన్ని 'టెక్స్ట్ నెక్' అని పిలుస్తున్నారు. టెక్స్ట్ నెక్ అనేది మెడలోని కండరాలు, నరాలను ఒత్తిడికి గురి చేస్తుంది. ఒక వ్యక్తి గంటల తరబడి ఫోన్ ముందు వంగి ఉండడం వల్ల అది వెన్నుపూసల మధ్య డిస్క్‌లపై మూడు నుంచి అయిదు రెట్లు ఎక్కువ ఒత్తిడి కలిగిస్తుందంటున్నారు వైద్యనిపుణులు.

- 'సాక్షి' ఫ్యామిలీతో మహిళా ఐపీఎస్‌ల మనోగతం

అమ్మ... నాన్న... నాలుగో సింహం







అణువంత ప్రోత్సాహంతో అంతులేనన్ని విజయాలు సాధిస్తామని నిరూపించారు. అపజయాలెన్ని ఎదురైనా వెరవకుండా లక్ష్యాన్ని సాధించి చూపారు. అమ్మానాన్నలు ఇచ్చిన ప్రోత్సాహం.. భరోసాతో దేశంలోనే అత్యున్నత సర్వీస్‌లలో ఒకటైన ఇండియన్ పోలీస్ సర్వీసెస్‌కు ఎంపికై శభాష్ అనిపించుకున్నారు. ఓ కూతురు కండక్టర్ అయిన తన తండ్రి కల నెరవేర్చితే... మరో కూతురు తన తండ్రి నుంచి పొందిన స్ఫూర్తితో సమాజ సేవకు సిద్ధమైంది. అమ్మ అండతో సాటి మహిళలకు భరోసాగా నిలిచే పోలీస్ అధికారి అవుతానని మరొకరు నిరూపించారు. నేషనల్ పోలీస్ అకాడమీలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 174 మందిలో 77 ఆర్ఆర్ (రెగ్యులర్ రిక్రూటీస్) బ్యాచ్ ఐపీఎస్ అధికారులు నేడు నిర్వహించనున్న పాసింగ్ ఔట్‌పరేడ్‌తో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా బ్యాచ్‌లోని ముగ్గురు మహిళా ఐపీఎస్‌ల మనోగతం... వారి మాటల్లోనే...

అమ్మ ఇచ్చిన భరోసాతోనే ముందుకు వెళ్లా!
- జయశర్మ

నేను ఐపీఎస్ అధికారి అయ్యానంటే అందుకు వందశాతం మా అమ్మే కారణం. నేను ఓటమి పాలైన ప్రతిసారి నాలో ధైర్యాన్ని నింపింది అమ్మ. ఒత్తిడిలో కూరుకుపోయిన ప్రతిసారీ నాకు భరోసా ఇచ్చి నన్ను ఇక్కడివరకు నడిపింది మా అమ్మ నీతూశర్మే. నా పేరు జయశర్మ. నా స్వస్థలం హర్యానాలోని హిస్సార్. మా నాన్న ప్రమోద్ కుమార్ శర్మ. నాన్న డిస్ట్రిక్ట్ ఫుడ్ సప్లై కంట్రోలర్‌గా పనిచేస్తున్నారు. అమ్మ గృహిణి. నేను ఢిల్లీ యూనివర్సిటీలో బీఎస్సీ మ్యాథ్స్ ఆనర్స్, ఐఐటీ ఢిల్లీ నుంచి ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ పూర్తి చేశాను. నాకు ఐపీఎస్ కావాలని చిన్ననాటి నుంచే కల. అమ్మ ప్రోత్సాహం, నాన్న అండతో నేను గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత సివిల్ సర్వీసెస్‌పై దృష్టి పెట్టా. ఇది ఎంతో కష్టమైన పని. కొన్నిసార్లు మనపై మనం నమ్మకాన్ని కోల్పోతాం. ఇది మన వల్ల కాదనిపిస్తుంది. అలాంటప్పుడు మనల్ని ప్రోత్సహించేవాళ్లు, భరోసా ఇచ్చేవాళ్లు ఎంతో అవసరం. నేను కూడా మూడుసార్లు సివిల్స్‌కి ఎంపిక కాకపోయినా నిరుత్సాహ పడలేదు. తప్పులు సరిచేసుకుంటూ ముందు వెళ్లా. ఐపీఎస్ ఎలాగైనా సాధించాలన్న నా పట్టుదలకు తోడు నా కుటుంబం, స్నేహితులు అండగా నిలిచారు. నాల్గో ప్రయత్నంలో నేను అనుకున్నట్టుగానే ఐపీఎస్‌కి ఎంపికయ్యాను.

నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ పూర్తిగా భిన్నమైంది. నేను ఎన్‌పీఏలోకి రాకముందు కనీసం వంద మీటర్లు కూడా పరిగెత్తినట్టు గుర్తు లేదు. కానీ ఇక్కడ శిక్షణతో ఇప్పుడు ఒంటిపై బరువు, చేతిలో రైఫిల్‌తో 40 కిలోమీటర్లు కూడా రన్నింగ్ చేసేంత స్థైర్యం వచ్చింది. మహిళా ఐపీఎస్ అధికారిగా మహిళా భద్రత, సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి పెడతాను.

నాలుగుసార్లు ఓడినా.. నాన్న ప్రోత్సాహం తగ్గలేదు
- అశ్విని.ఎస్

మా స్వస్థలం తమిళనాడులోని కన్యాకుమారి. నాన్న బస్ కండక్టర్‌గా పనిచేసి ఈ ఏడాది రిటైర్ అయ్యారు. అమ్మ గృహిణి. మా అక్క ప్రైవేటు ఉద్యోగిని. మేం ఇద్దరమూ అమ్మాయిలమే అయినా.. నాన్న మమ్మల్ని అన్నింటిలో ప్రోత్సహించేవారు. నేను అన్నా యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ప్రభుత్వ అధికారిగా ఉంటేనే సమాజానికి దగ్గరగా పనిచేయవచ్చని నాకు మొదటి నుంచి ఉండేది. అందుకే ఇంజినీరింగ్ తర్వాత ప్రైవేటు ఉద్యోగాలవైపు వెళ్లలేదు. తమిళనాడులో స్టేట్ జీఎస్టీ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశాను. కానీ.. నన్ను ఐపీఎస్ ఆఫీసర్‌ను చేయాలన్నది నాన్న కల. అయితే సివిల్స్‌కు ఎంపిక కావడం అంత సులువేం కాదు. ఐదో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించానంటే నాన్న ఇచ్చిన ప్రోత్సాహమే కారణం. ఎప్పటికప్పుడు గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటూ, వ్యక్తిగతంగా నోట్స్ తయారు చేసుకుంటూ నా ప్రయత్నాన్ని కొనసాగించాను. చివరికి విజయం దక్కింది. ఎన్నో కొత్త విషయాలను నేర్చుకునే అవకాశంతోపాటు మనలో ఉన్న సామర్థ్యాన్ని మనకు తెలియజేస్తుంది నేషనల్ పోలీస్ అకాడమీ ట్రైనింగ్. ఈ శిక్షణ తర్వాత నేను ఎంతో భరోసాగా చెప్పగలను – పోలీస్ ఉద్యోగం మహిళలు కూడా ఎంతో బాగా చేయగలరని! మా బ్యాచ్‌లో కూడా 65 మంది మహిళా ఐపీఎస్‌లు ఉండడమే అందుకు ఉదాహరణ. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్న వాళ్లకి నా సలహా ఒక్కటే..సివిల్స్ సాధించడం అనేది మీ లక్ష్యం అయితే, ఎన్ని అడ్డంకులు వచ్చినా మధ్యలో వదలొద్దని ముందే నిర్ణయించుకోవాలి. ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలి. అప్పుడు విజయం మనదే.

నాకు స్ఫూర్తి మా నాన్నే
- కీర్తియాదవ్

నాన్న ఎయిర్ మెన్‌గా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసి రిటైర్ అయ్యారు. ఇంట్లో ఎంతో క్రమశిక్షణ ఉండేది. నా చిన్నప్పటి నుంచి నాన్నను అలా యూనిఫాంలో చూస్తూ పెరగడంతో నాకు కూడా యూనిఫాం సర్వీసెస్ అంటే ఎంతో గౌరవం ఏర్పడింది. ఆయనే నాకు ఎప్పటికీ స్ఫూర్తి. స్కూలింగ్ పూర్తయి, కాలేజీకి వచ్చాక నాకు స్పష్టత వచ్చింది ఐపీఎస్ అధికారి అయితే ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం ఉంటుందని. అందుకే ఎప్పటికైనా ఐపీఎస్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లా. అయితే గ్జేవియర్స్ కాలేజ్ కోల్‌కతా నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తయి తర్వాత నేను మొదటి ప్రయత్నంలో సీఐఎస్ఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపికయ్యాను. 2020లో ట్రైనింగ్ చేస్తూనే సివిల్స్ ప్రిపరేషన్ కొనసాగించాను. ఆ తర్వాత ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌కు ఎంపికయ్యాను. అయినా, ఐపీఎస్ కలను వదల్లేదు. నాల్గో ప్రయత్నంలో నాకు ఐపీఎస్ వచ్చింది. నాన్న ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేయడం.. మొదటి నుంచి ఎంతో క్రమశిక్షణతో పెరగడంతో ఇక్కడి ట్రైనింగ్ కష్టంగా అనిపించలేదు. సులువుగానే శిక్షణ పూర్తి చేశా. ఇక్కడ నేర్చుకున్న విషయాలు వృత్తిగతంగానే కాకుండా వ్యక్తిగతంగా నన్ను ఎంతో మార్చాయి. నాకు తెలంగాణ పోలీసులో మహేశ్ భగవత్ ఇన్‌స్పిరేషన్. ఐపీఎస్ అధికారిగా నేను మహిళా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. నేను హర్యానాలో పుట్టిపెరిగాను. అక్కడి పరిస్థితులు చూశాక..మహిళా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా.

– నాగోజు సత్యనారాయణ, స్టేట్ క్రైమ్ రిపోర్టర్, సాక్షి, హైదరాబాద్
ఫొటోలు : ఏ. జాన్

● నయా వంచన | డిజిటల్ మోసాలు

పండగ రోజులు కదా...
ఎర వేస్తారు!

స్టే స్మార్ట్ స్టే సేఫ్



పండగ కదా.... ఆన్‌లైన్ షాపింగ్ ప్రయత్నాలలో ఉన్నప్పుడు 'ఫ్రీ దీపావళి గిఫ్ట్' అంటూ పాపప్ కనిపించవచ్చు. 'ఈ ప్రశ్నలకు జవాబు చెప్పి దీపావళి బహుమతులు గెలుచుకోవచ్చు' అనే ప్రకటన మెరుపులా మెరియవచ్చు.

దీపావళిని పురస్కరించుకొని దుస్తుల నుంచి వస్తువుల వరకు ఆన్‌లైన్ షాపింగ్ ఊపందుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ మోసగాళ్లకు చేతినిండా పనే!

పండగ రోజుల్లో ఆన్‌లైన్ స్కామ్‌లు ఎక్కువగా జరగడానికి అవకాశం ఉంది. నకిలీ ఈ-మెయిల్స్, టెక్స్ట్, కాల్స్ ద్వారా స్కామ్‌లు జరుగుతుంటాయి. ఈ పండగ సీజన్‌లో మోస్ట్ కామన్ స్కామ్... నకిలీ ఆర్డర్ లేదా అకౌంట్. మీ అకౌంట్ తాత్కాలికంగా నిలిపివేయబడిందని, ఆర్డర్‌కు పేమెంట్ వెరిఫికేషన్ అవసరమని పేర్కొంటూ హానికరమైన లింక్‌లను క్లిక్ చేసేలా, వ్యక్తిగత వివరాలు షేర్ చేసే విధంగా కస్టమర్‌లను ప్రేరేపిస్తారు.

'గత సంవత్సరం 55,000 ఫిషింగ్ వెబ్‌సైట్‌లను, 12,000 స్కామ్ ఫోన్ నంబర్లను బ్లాక్ చేశాం. పండగ సీజన్ ముందు ఆన్‌లైన్ స్కామ్‌లపై వినియోగదారులకు అవగాహన కలిగించడానికి ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్‌తో కలి పనిచేశాం' అన్నారు అమెజాన్ ఇండియా, వైస్ ప్రెసిడెంట్ (లీగల్) రాకేష్ బక్షీ.

'స్కామర్‌లు నకిలీ షాపింగ్ వెబ్‌సైట్‌లను లేదా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లాంటి ప్రసిద్ధ బ్రాండ్‌లను అనుసరించి ఆన్‌లైన్ ప్రకటనలను సృష్టిస్తారు. నమ్మశక్యం కాని డిస్కౌంట్‌లతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. పరిమిత కాల ఆఫర్‌లతో కస్టమర్‌లను ఆకర్షిస్తారు. ఒక కస్టమర్ ఆర్డర్ చేసి చెల్లింపు చేసిన తర్వాత నకిలీ ప్రాడక్ట్స్ అందుతాయి. అసలు ఏమీ అందకపోవచ్చు కూడా. నకిలీ వెబ్‌సైట్‌లు తరచుగా అధికారిక బ్రాండ్ లోగోలు, ప్రాడక్ట్ ఇమేజ్‌లను, చట్టబద్ధమైన సైట్‌లను తలపించేలా పాలిష్ చేసిన డిజైన్‌లను ఉపయోగిస్తాయి. కొందరు నిజమైన వెబ్‌సైట్‌ల లేఅవుట్, డొమైన్ పేరును కూడా క్లోన్ చేస్తారు. తేడాను గుర్తించడం కష్టంగా ఉంటుంది' అంటున్నారు సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ శుభంసింగ్.

చాలామంది స్కామర్‌లు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ 'గివ్ అవే' పోటీలు లేదా లక్కీ డ్రాల గురించి పోస్ట్ చేస్తారు. మీ బ్యాంక్ వివరాలను షేర్ చేయమని లేదా క్లెయిమ్ యువర్ ప్రైజ్ లింక్‌పై క్లిక్ చేయమని అడగవచ్చు. వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఎప్పుడూ షేర్ చేయవద్దు.

అనుమానాస్పద ఎకౌంట్‌ల గురించి వెంటనే రిపోర్ట్ చేయండి. బ్లాక్ చేయండి. బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోండి.

స్త్రీ హెల్త్‌పై దృష్టిపెట్టాలి


కృతిసనన్

చలం, అంబేద్కర్‌ల నుంచి నటి, ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ) జెండర్ ఈక్వాలిటీకి ఈ దేశపు రాయబారి కృతిసనన్ దాకా అందరి మాటా ఒకటే స్త్రీ ఆరోగ్యమే దేశ భవిష్యత్ భాగ్యం అని!

నిజానికి మహిళా ఆరోగ్యం, లింగ సమానత్వం గురించి మాట్లాడుకోవడానికి ప్రత్యేక సందర్భం అక్కర్లేదు.. అయినా ఈ ప్రస్తావనకు ప్రత్యేక సందర్భమూ ఉంది. అదే బెర్లిన్ (జర్మనీ)లో జరిగిన వరల్డ్ హెల్త్ సమ్మిట్ 2025. ఇందులో ఆమె మహిళల ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాల్సిన అవసరం గురించి మాట్లాడారు. ఇలా వరల్డ్ హెల్త్ సమ్మిట్‌లో ప్రసంగించిన తొలి భారతీయ నటిగా కీర్తి గడించారు. ఆ ప్రసంగంలో కీర్తి సనన్ ఏం మాట్లాడారంటే..

'మహిళల ఆరోగ్యం నిర్లక్ష్యం చేయాల్సిన లేదా పక్కన పెట్టాల్సిన విషయం కాదు. తక్షణమే దృష్టిపెట్టాల్సిన అత్యంత అవసరమైన అంశం. ఆమె ఆరోగ్యం.. మానవాళి ప్రగతికి, భవిష్యత్‌కు మూల స్తంభం. అందుకే మహిళా ఆరోగ్యానికి సంబంధించి సుస్థిరమైన పెట్టుబడులు కావాలి. ఆవిష్కరణలు జరగాలి. ఇందుకోసం చేసే ప్రతి ప్రయత్నం అద్భుతమైన ఆర్థిక, సామాజిక మార్పులుగా ప్రతిఫలిస్తుంది. ఏటా ముప్పై కోట్లు ఇన్వెస్ట్ చేస్తే పదమూడు వందల కోట్ల రాబడి కనిపిస్తోంది. అంటే దాదాపు తొమ్మిది రెట్ల లాభం. ఈ ఇన్వెస్ట్‌మెంట్ నైతికావసరమే కాదు మన మూకుమ్మడి భవిష్యత్‌కు భరోసా కూడా! ఎందుకంటే మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు, సమాజం.. ఆరోగ్యంగా ఉంటాయి. ఆరోగ్యవంతమైన సమాజం ఆర్థిక సుస్థిరతకు చిహ్నం. కానీ ప్రపంచ జనాభాలో సగంగా ఉన్న మహిళల ఆరోగ్యం ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతూనే ఉంది. యూఎన్ఎఫ్‌పీఏ జెండర్ ఈక్వాలిటీ అంబాసిడర్‌గా చాలా ప్రాంతాలు తిరిగాను. అవన్నీ కూడా బాల్యవివాహాలకు సాక్ష్యంగా కనపడ్డాయి. అమ్మాయిలకు మానసిక ఆరోగ్యం సంగతి అటుంచి కనీసం శారీరక ఆరోగ్య కేంద్రాలు కూడా అందుబాటులో లేని దుస్థితిలో ఉన్నాయి. వీళ్ల జీవితాలు మారాలంటే మహిళల ఆరోగ్యానికి సంబంధించి దృష్టి పెరగాలి. తక్షణమే ఆ దిశగా కార్యాచరణ నిర్ణయాలు జరగాలి' అన్నారు కృతిసనన్.

ఫ్యాషన్

పండగలకు, సంప్రదాయ వేడుకలకూ నిండైన హుందాతనాన్ని తీసుకువచ్చేలా
కట్టూ బొట్టు విషయంలో అతివలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు.
ఈ దీపావళి వేళ మరింత స్పెషల్‌గా కనిపించాలనుకునే వారికోసం
బెంగాలీ చీరకట్టు ఆధునికతనూ అద్దుకొని కొంగొత్తగా మెరిసిపోతుంది.
సెలబ్రిటీలూ ముచ్చటపడే ఈ కట్టుకు వారు జోడించే హంగులు ఇవి...

పండగంతా నిండుగా...

పండగలు, ఇతర సంప్రదాయ వేడుకలలో బెంగాలీ స్టైల్ చీర కట్టును దేశవ్యాప్తంగా మహిళలు ధరించడానికి ఇష్టపడుతున్నారు. ఉత్తేజాన్ని కలిగించే ఎరుపు-తెలుపు కాంబినేషన్‌లో ఉండే ఈ చీర కట్టు, నుదుటన పెద్ద బిందీ, శంఖం ఆకృతిలో నెక్ డిజైన్, చీర పల్లూకున్న అందమైన డిజైన్.. ఇవన్నీ పండుగను మరింత ప్రత్యేకంగా చేస్తాయి. దుర్గాపూజల సమయాల్లో ఈ రంగు చీరలను బెంగాలీలు ప్రత్యేకంగా ధరిస్తారు. ఆ స్టైల్ కట్టును ఇప్పుడు లక్ష్మీ పూజలు, వివాహ వేడుకల సమయాల్లో ధరించడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే, ఈ కట్టును మనం అనుసరించాలంటే మాత్రం ఈ సూచనలు తప్పక అవసరం.









హెయిర్ స్టైల్- మేకప్
హెయిర్ స్టైల్ కోసం ఒక బన్ తయారు చేసి, దానిని మల్లె పువ్వులు లేదా ఎరుపు, తెలుపు పువ్వులతో అలంకరించవచ్చు. పువ్వులతో కాకున్నా హెయిర్ బన్‌కు హెయిర్ పిన్ జ్యువెలరీని జోడించడం ద్వారా అందాన్ని పెంచుకోవచ్చు. మేకప్ కోసం ఎరుపు లిప్‌స్టిక్, తేలికపాటి ఐ మేకప్ సరిపోతాయి. ధరించిన చీరకు మేకప్ సెట్ అవుతుందా అనేది సరి చూసుకుంటే చాలు. మెడలోనూ, చేతులకు ఎక్కువ నగల లేకుండా చూసుకుంటే చాలు. మీ రూపం ఆధునికతను అద్దుకున్న సంప్రదాయంతో కొంగొత్తగా మెరిసిపోతుంది.

ఎంపికలో సరైన చీర
పూజలు, నోములు, వ్రతాల సమయంలో ఎరుపు అంచుతో ఉన్న తెలుపు లేదా ఆఫ్-వైట్ బేస్ చీరను ఎంచుకోవాలి. అంచు ఉన్న కాటన్, పట్టు లేదా టస్సర్ చీరలు ఈ బెంగాలీ లుక్‌కు సరైనవి. వీటిలో మనవైన చేనేతలు కూడా ఉండవచ్చు. ఈ చీరకట్టు సౌకర్యంగా ఉండటమే కాకుండా పూజ, పండగల సమయాల్లో రోజంతా ధరించడం సులభం కూడా.

కట్టుతో కట్టడి
బెంగాలీ స్టైల్‌లో నిజమైన ఆకర్షణ దాని డ్రేపింగ్ శైలిలోనే ఉంటుంది. చీర కుచ్చిళ్ల నుంచి ఎడమ వైపుగా, పొడవాటి పల్లూను ఛాతీ మీదుగా భుజం వరకు తీసుకుంటూ వెళ్లాలి. పొడవాటి పల్లూ భాగాన్ని కుడి చేతి భుజం కిందుగా తీసి, పైకి అంచు భాగం కనిపించేలా బ్లౌజ్‌కు జత చేయాలి. పొడవుగా తీసుకున్న కొంగు భాగాన్ని కుడి చేత్తో ముందుకు తీసుకువచ్చి పట్టుకోవడం కూడా ఈ కట్టులో అందంగా కనిపిస్తుంది. భుజం మీదుగా తీసిన పల్లూని కొప్పుకు అటాచ్ చేసి, ఎడమ భుజం కిందుగా తీసుకురావచ్చు. ఈ కట్టు లలనల రూపాన్ని మరింత సంప్రదాయంగా మారుస్తుంది. డ్రేపింగ్ చేసేటప్పుడు, కుచ్చుల భాగం మడతలు లేకుండా సెట్ చేసి, పల్లూ చాలా తేలికగా ఉన్నట్టు చూసుకోవాలి.

నగలపై ప్రత్యేక శ్రద్ధ
పెద్ద పెద్ద చెవిపోగులు, గాజులు, నెక్లెస్‌లు ఈ స్టైల్ చీరకట్టుకు రాయల్ టచ్‌ను జోడిస్తాయి. హెవీగా ఆభరణాలు అక్కర్లేదు అనుకుంటే పెద్ద చెవిపోగులు, గాజులు ఈ అలంకరణకు సరిపోతాయి.

గుండ్రని వెడల్పాటి బిందీ
బెంగాలీ స్టైల్ డ్రేపింగ్ సంపూర్ణం కావాలంటే నుదుటన పెద్ద, గుండ్రని ఎరుపు బిందీ తప్పక ఉండాలి. ఇది పండుగల రోజుల్లో మొత్తం మేకప్‌ను పూర్తి చేస్తుంది. నుదుటిపై బిందీతో పాటు సిందూర్ చుక్కలను కూడా అదనంగా పెట్టడం వల్ల లుక్ మరింత మెరుగవుతుంది. ఈ లుక్‌కి ఎరుపు లేదా ముదురు గులాబీ రంగు బిందీ ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

● టెక్నాలజీ

ఇంటిపని నుంచి తోటపని వరకు...
ఫిగర్ వో 3



'ఫిగర్ ఏఐ' అనేది హ్యూమన్ రోబోలకు సంబంధించిన స్టార్టప్. తాజాగా 'ఫిగర్ వో 3' అనే హ్యూమన్ రోబో గురించి ప్రకటించింది కంపెనీ. 'రోజువారీ అవసరాలకు ఉపయోగపడే సాధారణ హ్యూమనాయిడ్ రోబో ఇది. గదిని శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు పెట్టడం, ఆహారాన్ని వడ్డించడం, గిన్నెలు కడగడం, బట్టలు మడత పెట్టడం...మొదలైన ఎన్నో పనులు చేస్తుంది' అని 'ఫిగర్ వో 3' వివరాలు వెల్లడి చేసింది కంపెనీ. కాలిఫోర్నియాకు చెందిన 'ఫిగర్ ఏఐ' స్టార్టప్ మునుపటి తరం హ్యూమనాయిడ్‌లతో పోల్చితే సరికొత్త, సాంకేతికంగా ఒక అడుగు ముందుండే హ్యూమనాయిడ్స్ దృష్టి పెట్టింది. పూర్తిగా రీడిజైన్ చేసిన సెన్సరీ సూట్, హ్యాండ్ సిస్టమ్, నెక్స్ట్ జనరేషన్ విజన్ సిస్టమ్‌తో ఈ సరికొత్త హ్యూమనాయిడ్ రోబో మార్కెట్‌లోకి అడుగు పెట్టనుంది.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) అక్టోబర్ 16న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,31,900	1,31,320	1,29,440	1,31,320	1,31,300	1,29,810
బంగారం (22 క్యారెట్లు)	1,22,790	1,18,650	1,18,650	1,22,210	1,20,800	1,19,000
వెండి	1,90,000	1,82,900	2,06,000	1,82,900	1,80,000	2,06,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.